

బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

రజతోత్సవ సభకు జనసమీకరణ చేయాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేయడానికి డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి డివిజన్లలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని, వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున తరలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వివిధ డివిజన్ల అధ్యక్షులు రాకేష్, కొండ శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్, వల్లాల శ్యామ్‌యాదవ్, బళ్ల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, దీనదయాల్‌రెడ్డి, ముఠా నరేష్, నవీన్, మాధవ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

ముషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం కింద నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎంబీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలకోసం రుణం పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు గురువారం తెలిపారు. దరఖాస్తుదారులు స్థానికంగా ఉన్న వార్డు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఈ పథకం ద్వారా అర్హులైన ప్రజలు లబ్ధి పొంద వచ్చని పేర్కొన్నారు. ఈ నెల 14 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. జీహెచ్ఎంసీ సర్కిల్-15లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రతినిధులు

సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ 131వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఇందిరాపార్కులో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమానికి సైబర్ క్రైమ్ ఏసీపీ ప్రసాద్, పంజాబ్‌నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ చుగ్ తోపాటు పంజాబ్‌నేషనల్ బ్యాంక్ సిబ్బంది హాజరయ్యారు. ఇందిరాపార్కులో వాక్ నిర్వహించి సైబర్ క్రైమ్ సెక్యూరిటీ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు వాకర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజలకు పలువిధాలుగా సైబర్‌క్రైం వల్ల మోసపోవద్దని ప్రచారం నిర్వహించినా మోసపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో పంజాబ్‌నే షనల్ బ్యాంక్, అధికారులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరాపార్కులో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ప్లకార్డులతో అవగాహన కల్పించారు.

అక్షర చిట్‌ఫండ్ బాధితుల ధర్నా

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో పెరిగిపోతున్న సైబర్ సెక్యూరిటీ మోసాలకంటే చిట్‌ఫండ్, ఫైనాన్స్ కంపెనీల బాధితులు పెరిగిపోతున్నారని, ప్రజలకు అధిక వడ్డీ ఆశచూపి మోసాలకు పాల్పడుతున్న చిట్‌ఫండ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఉపా లాంటి చట్టాలను తీసుకురావాలని సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా జరిగిన ధర్నాలో మాట్లాడుతూ పేదలకు అధిక వడ్డీల ఆశచూపి మోసం చేసినవారి ఆటలకు అడ్డుకట్ట వేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అక్షర చిట్‌ఫండ్ పేరుతో వేయికోట్లు మోసం చేసిన పేరాల శ్రీనివాస్‌రావు, పేరాల శ్రీ విద్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులంతా ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని అక్షర చిట్‌ఫండ్స్‌కు, యజమానులకు, బినామీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

● ఉద్యోగం కోల్పోయిన బాధితులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో అకారణంగా తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బాధితులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ డిపోలో అటెండర్, స్వీపర్‌గా తాము కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని, కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ మల్లారెడ్డి తమను విధుల నుంచి తొలగించి అన్యాయం చేశాడని వారు ఆరోపించారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలగించిన ఉద్యోగులు నాగమల్లేశ్వరి, సుమిత్ర, రుక్మిణీలు మాట్లాడుతూ.. బర్కత్‌పుర డిపో మేనేజర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దళిత బహుజన వర్గాలను అణచి వేస్తున్నారని, తాము ఎస్సీ కుటుంబానికి చెందిన వాళ్లం కాబట్టే విధుల నుంచి తొలగించారని వారు ఆరోపించారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని అవి అడిగినందుకే విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిపో నుంచి 9 మంది సిబ్బందిని తొలగించారని, ఒక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న డిపో మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



కట్టెలపొయ్యి, గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలి

● కట్టెల పొయ్యి పెట్టి సీపీఎం నిరసన

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యి గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన చేశారు. మోదీ హయాంలో గ్యాస్ బండ పేదల పాలిట గుదిబండ, పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, పేదలపై భారాలు, కార్పొరేట్లకు వరాలా, వంట గ్యాస్ ధరలు పెంచిన మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించండి అని నినాదాలు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై 50 రూపాయల ధరలు పెంచి దేశ ప్రజలమీద రూ.3700 కోట్ల భారం వేసిందని విమర్శించారు.పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 380 రూపాయలు ఉన్న సిలిండర్ ఈరోజు 905 రూపాయలకు పెరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డీజీ నరసింహారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు, ఎం. దశరథ్, కె నాగలక్ష్మి, ఆర్. వెంకటేశ్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి భారీగా ఏర్పాట్లు

● రాంనగర్ చౌరస్తాలో డిజిటల్ కటౌట్లు ● శోభాయాత్రకు భారీగా పోలీసు బందోబస్తు

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ఈ నెల 12వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించేందుకు రాంనగర్ శ్రీహనుమాన్ జయంతి ఉత్సవ సమితి భారీ ఏర్పాట్లను చేస్తుంది. వీరహనుమాన్ శోభాయాత్రను ఈ సారి పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాంనగర్ చౌరస్తాలో యాభై ఫీట్ల ఎత్తులో అయోధ్య రామాలయం, శ్రీరాముడు, శ్రీహనుమంతుడి డిజిటల్ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి రోజు నిర్వహించే శోభాయాత్ర జరిగే మార్గంలో దారిపొడవున విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. పలుచోట్ల స్వాగత వేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. శోభా యాత్రకు అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆహ్వాన పత్రాలను నిర్వాహకులు అందజేశారు.



రాంనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డిజిటల్ కటౌట్లు

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్ జయంతి సందర్భంగా రాంనగర్ హనుమాన్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆలయం వద్ద అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం నవీన్ అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమానికి కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సలహాదారులు తూడుం రాజు, సభ్యులు జగదీష్, రాకేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు

శోభాయాత్రను జయప్రదం చేయాలి



హనుమాన్ శోభాయాత్రకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలి. శోభాయాత్ర 12వ తేదీన సాయంత్రం 6 గంటలకు రాంనగర్ బ్రిడ్జి సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుంది. ఈ యాత్ర రాంనగర్ చౌరస్తా, చేపల మార్కెట్, బాకారం మీదుగా హరినగర్ గ్రౌండ్ వరకు చేరుకుంటుంది.

- గడ్డం నవీన్, ఉత్సవ సమితి ప్రతినిధి

భారీ బందోబస్తు



ముషీరాబాద్ నియోజకవర్గంలో హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలి. హనుమాన్ జయంతి సందర్భంగా అన్ని ఆలయాల వద్ద, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. హనుమాన్ విజయ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఉత్సవాలకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి.

- రాంబాబు, ముషీరాబాద్ సీఐ

ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిరక్షించేందుకు చర్యలు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో చెత్తా చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని బీమామైదాన్‌లో పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌కు కార్పొరేటర్ రచనశ్రీ పది సంవత్సరాలుగా ఎన్టీఆర్ స్టేడియం ఆదరణకు కరువై చెత్తాచెదారం పేరుకుపోయి నిరుపయోగంగా మారిందని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో పాటు ఎన్‌స్టేడియంను సందర్శించాలని కోరడంతో ఆయన స్టేడియంను సందర్శించారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న సమయంలో ఎన్టీఆర్ స్టేడియం బాగా ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళాభారతి నిర్మాణం చేస్తామని టూరిజం డిపార్ట్‌మెంట్‌కు కేటాయించడంతో ఎన్టీఆర్ స్టేడియం పూర్తిగా నిరుపయోగంగా మారిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్టేడియంలో చెత్త చెదారం వేయకుండా పూర్వవైభవం తీసుకువచ్చేలా తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, కన్వీనర్ రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ గంగపుత్ర. కేశవరాజు. గంట శ్రీనివాస్, కె శంకర్, తహసీల్దార్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బీమామైదాన్‌లో బాంబేఇళ్లు పెచ్చులూడి కూలిపోయే స్థితిలో ఉన్నాయని కలెక్టర్‌కు బీమామైదాన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ వినతి అందజేశారు. వాటికి మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బస్తీ వాసులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు



వీఎస్టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ సభ్యులతో యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి

వీఎస్టీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఏర్పాటు

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం బాగ్‌లింగంపల్లిలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జీ.సంజీవరెడ్డి ప్రకటించారు. యూనియన్ సలహాదారులుగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, వీఎస్టీ రిటైర్డ్ కార్మిక నాయకుడు కె.రాజు, ముఖ్య ఉపాధ్యక్షుడు జీ.నాగేష్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ సమర్, ఎస్.రణ్‌ధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్.డి.పాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, అసిస్టెంట్ కార్యదర్శులుగా ఎల్.నవీన్‌బాబు, ఆర్.విజయేందర్; ప్రచార కార్యదర్శిగా ఎ.వెంకటరెడ్డి, సహాయ ప్రచార కార్యదర్శిగా పి.రామ్మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.ప్రభాకర్; సహాయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.సాయిప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా డి.కృష్ణారెడ్డి, క్యాంటీన్ సెక్రటరీగా వినోద్‌కుమార్‌ను ఆయన ప్రకటించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో కంపెనీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని జీ.సంజీవరెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు కార్యకర్తలు కృషి చేయాలని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి సూచించారు. బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని అడిక్‌మెట్ డివిజన్ టీఆర్‌టీ కాలనీలోని పోలింగ్ బూత్ 230 పరిధిలో బండారు దత్తాత్రేయ ఇంటి వద్ద పార్టీ వేడుకలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా దత్తాత్రేయ ఇంటిపై రాంనగర్ మీ సేవ వద్ద ఏర్పాటు చేసిన పార్టీ పతాకాలను డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్‌తో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాలని సూచించారు.

హోర్డింగ్ కూలి మహిళకు గాయాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు హోర్డింగ్ కూలి ఓ మహిళకు గాయాలయ్యాయి. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రిసాల ప్రాంతానికి చెందిన యాదమ్మ(50) గోల్కొండ చౌరస్తాలోని బస్టాండ్ పక్కన మొక్కలు విక్రయిస్తుంది. గురువారం సాయంత్రం ఆమె తన దుకాణం వద్ద కూర్చుని ఉంది. పక్కన ఉన్న హోర్డింగ్ ఒక్కసారిగా ఈదురు గాలులకు కూలి ఆమెపై పడింది. గాయాలపాలైన ఆమెను ఎస్ఐ నాగరాజు సిబ్బందితో కలిసి చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె నడుముకు గాయమైందని అయితే మాట్లాడుతుందని చికిత్స కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ వివరించారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

ముషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగ్గా లేని యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రాంనగర్ మేడిబావి బస్తీకి చెందిన సంతోష్ అలియాస్ కమల్ (34)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని తల్లిదండ్రులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్ అలియాస్ కమల్

బీసీ హాస్టళ్లకు స్థలాలు సేకరించండి


● ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీ బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు సేకరించాలని, స్థలాలు కేటాయిస్తే భవన నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య గురువారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 325 బీసీ కాలేజీ హాస్టల్స్ కొనసాగుతున్నాయని, వీటిలో ఒక సొంత భవనం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ హాస్టల్స్ ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన ప్రభుత్వం సొంత భవనాలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. అవసరం లేని వాటికి వందల కోట్లను కేటాయిస్తూ విద్యార్థుల కోసం స్థలాలు, నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మలక్‌పేట ప్రింటింగ్ ప్రెస్ వద్ద ఉన్న 50 ఎకరాల స్థలం, చంచల్‌గూడ జైలు వెనక 100 ఎకరాల భూమి, మలక్‌పేట టీవీ టవర్ వద్ద వెనుక గల ప్రభుత్వ క్వార్టర్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలం, రేస్‌కోర్స్‌కు సంబంధించిన 168 ఎకరాల స్థలం, ఓయూకు నాలుగు దిక్కుల గల ఖాళీగా ఉన్న క్వార్టర్స్ స్థలం, రామంతాపూర్‌లోని టీవీ స్టూడియోలో గల ఖాళీ స్థలం, విద్యానగర్‌లోని ఓయూ వద్ద గల ఖాళీ స్థలం, సైఫాబాద్ సైన్స్ కాలేజీ, పీజీ కాలేజీ, సికింద్రాబాద్, బేగంపేటలోని ప్రభుత్వ కళాశాలల ఖాళీ స్థలాలను ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల కోసం హస్టల్స్ నిర్మాణం కోసం కేటాయించాలని సీఎంను ఆర్.కృష్ణయ్య కోరారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 19 నుంచి స్లాట్‌లు బుక్

● సాయంత్రం 5 గంటల వరకు 16 రిజిస్ట్రేషన్లు పూర్తి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి వచ్చింది. గురువారం 19 స్లాట్‌లు బుక్ కాగా సాయంత్రం 5 గంటల వరకు 16 రిజిస్ట్రేషన్‌లు జరిగాయని 6 గంటలవరకు సమయం ఉంది కాబట్టి మిగతావి కూడా రిజిస్ట్రేషన్ కావొచ్చునని సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్ తెలిపారు. ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను అందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరించడంలో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చిన విషయం విదితమే. నగరంలోని 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌విధానం అమలులోకి తేనున్న దరిమిలా చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా అమలు చేశారు..



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌చందర్

కానూరు వెంకటేశ్వరరావు జీవితం స్ఫూర్తిదాయకం

నల్లకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజానాడిని పట్టుకున్న కానూరు వెంకటేశ్వరరావు రచనలు అనునిత్యం ప్రజలను ఆలోచింపచేసి కర్తవ్యబోధనలు చేసేవారని సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ కవి సతీష్‌చందర్ అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, విప్లవ సాంస్కృతిక ఉద్యమ కళారంగయోధులు కానూరు వెంకటేశ్వరరావు 10వ వర్ధంతి సభ గురువారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వినయ్ బాబు కానూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సతీష్‌బాబు మాట్లాడుతూ హాస్యాన్ని, వ్యంగ్యాన్ని పండించడం ద్వారా ప్రజలకు ఉద్యమాలకు 60 ఏళ్లుగా దిక్సూచిగా నిలిచిన నిజమైన విప్లవ సాంస్కృతిక ఉద్యమ యోధుడిగా కానూరు ఆదునికరించారని పేర్కొన్నారు. సభలో కళాకారులు కానూరు జీవితంలో పాటలు పాడారు. కార్యక్రమంలో ఉదయగిరి, మల్లన్న, ఎం.దాసు, వేణు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్రకు స్వాగతం పలుకుతూ వివిధ పార్టీల నేతలు, కార్పొరేటర్లు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు

● ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. ఈనెల 12న శోభాయాత్ర సాగనున్న నేపథ్యంలో ప్రధాన కూడలి అయిన ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌లు పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చిక్కడపల్లినుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, అరుంధతినగర్, సబర్మతినగర్, గాంధీనగర్ నూతన లింక్ బ్రిడ్జి వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో స్వాగతం పలుకుతూ పలు పార్టీల నేతలు, కార్పొరేటర్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



అహ్మద్‌నగర్ బస్తీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అహ్మద్‌నగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

అంబర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అంబర్‌పేట డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి గురువారం పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి లోప్రెషర్, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచితంగా హోమియోపతి వైద్యసేవలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఉచితంగా హోమియోపతి వైద్యసేవలు అందించడం విశేషమని ప్రముఖ జర్నలిస్ట్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్‌రావు అన్నారు. చిక్కడపల్లిలోని హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(హెచ్ఎంఏటి) హోమియోపతి ఆస్పత్రిలో గురువారం వృద్ధులకోసం ఉచితంగా నిర్వహించే ప్రత్యేక ఔట్ పేషెంట్ స్పెషాలిటీ విభాగాన్ని జితేందర్‌రావు ప్రారంభించారు. ముందుగా హోమియోపతి వైద్యపితామహుడు డా. హానిమన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధుల స్పెషాలిటీలో సేవలు అందించేందుకు సీనియర్‌హోమియోపతి వైద్యుడు డా. జి. దుర్గాప్రసాద్‌రావు, ప్రతి రెండు, నాలుగవ గురువారం సాయంత్రం 4 నుంచి 5 వరకు అందుబాటులో ఉంటారని హెచ్ఎంఏటి సంస్థ మెడికల్ డైరెక్టర్ డా. కె. గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డా. వేణుగోపాల్, డా.ముస్కాన్ అగర్వాల్, డా. ఆదిత్య, డా. ప్రగతి, డా. క్రిష్ణా, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఆర్టీసీ డిపోకు సంబంధించిన సమస్యలు, బస్సుల రాకపోకలలో కలుగుతున్న అంతరాయం ఇతరత్ర సమస్యలను తెలుసుకోవడానికి ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. సమ స్యలను తమ దృష్టికి తీసుకురావడానికి 995926418లో సంప్రదిం చాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు గవర్నర్ ఆమోదించడం వెనక కేంద్రం హస్తం

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రాజు

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిబంధనలు పాటించని తెలంగాణ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు గవర్నర్ ఆమోదించడం వెనక కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ హస్తం ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ రాజు ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత కులాల్లో ఉన్న మెజార్టీ మాల ఉప కులాలను అణచివేసి వారి ప్రయోజనాలను దెబ్బతీసి మిగతా ఎస్సీ మాదిగ కులాలకు లబ్ధి చేకూర్చడం కోసం అంతిమంగా మొత్తం దళిత సమాజాన్ని బానిసత్వం చేసుకోవడం కోసమే ఈ వర్గీకరణను తీసుకువచ్చారని అన్నారు. ఇది ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమేనని ఆయన విమర్శించారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సర్కార్‌తో పాటు దానికి సహకరించిన బీజేపీకి బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాస్, తెలంగాణ అధ్యక్షుడు జెఎస్ రావు తదతరులు పాల్గొన్నారు.